రైతుల ఆశలపై నీళ్లు

- తెల్ల బంగారానికి తెగుళ్ల బెడద
- మొదటి కాతకే పరిమితమైన పత్తిచేలు
- కాయదశలోనే ఎండిపోతున్న వైనం
- వేధిస్తున్న అప్పులు, పెట్టుబడులు
- అయోమయంలో రైతాంగం



ఎండిపోతున్న పత్తి కాయలు

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పత్తి పంటకు మొదటి కాత దశలోనే తెగుళ్లు సోకుతున్నాయి.. చేసిన అప్పులు ఒకవైపు.. పెట్టుబడులు వస్తాయో లేవోననే దిగులు మరోవైపు.. సకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు సరిగా మొలకెత్తలేదు. పంట పూతదశకు వచ్చి ఎదుగుదల నిలిచిపోవడంతో పత్తి చేలను ఏవిధంగా కాపాడుకోవాలి.. పంట సాగుకోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

– మునిపల్లి(అందోల్)

సకాలంలో కురవని వర్షాలు

విత్తనాలు నాటేందుకు రైతులు ముందస్తుగా వేసవికాలంలోనే దుక్కులు దున్ని చదును చేస్తారు. 60శాతానికి పైగా రోహిణి కార్తెలోనే పత్తి పంటను సాగు చేస్తారు. ఈ క్రమంలో ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో పత్తి చేలు బెట్టకు వచ్చి (ఎచ్చిపచ్చి)గా అంతంత మాత్రంగానే విత్తనాలు మొలకెత్తాయి. పత్తి పూత, కాయదశలో ఉన్న పంటకు నీరు అందకపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి.

ఎర్రబారి ఎండిపోతున్న పత్తికాయలు

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పత్తి మొక్క దగ్గర భూమి లూజు కావడంతో పత్తి మొలకలు కింద పడిపోయాయి. దీంతో పత్తి మొక్కల్లో బలం లేకుండాపోవడం, ఉన్న కాయలు ఎర్రబారి ఎండిపోతుండటంతో కనీసం పెట్టుబడులు వస్తాయో రావోననే ఆందోళన రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రతి ఏడాది అతివృష్టి లేదా అనావృష్టి, పండిన పంటలకు మార్కెట్‌లో ధరలు లేకపోవడం కారణంగా అప్పులు పెరిగి ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

కౌలురైతులకు తప్పని కష్టాలు

వ్యవసాయంపై మక్కువ ఉన్న సన్నాచిన్నకారు రైతులు భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. దుక్కి దున్ని.. చదును చేసిన నాటి నుంచి పంట చేతికొచ్చేవరకు ఎకరాకు రూ.20 నుంచి 30 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎకరానికి రూ.15వేల నుంచి 20 వేల వరకు కౌలు చెల్లించాల్సి ఉంటుంది. ఆశించిన దిగుబడి వచ్చినా రాకపోయినా భూయజమానికి కౌలు చెల్లించాల్సిందే. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని కౌలురైతులు కోరుతున్నారు.

పిచికారీతో తెగుళ్ల నివారణ



పత్తి పంటలో సోకే తెగుళ్లను గుర్తించి రైతులు వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి. పంటకు సోకే ఎర్రగుమ్మడి తెగులు నివారణకు మెగ్నీషియం సల్ఫేట్, యూరియా పది గ్రాముల చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పేనుబంక, పచ్చదోమ, తామర పురుగుల నివారణకు ఇమీడాక్లోపిరైడ్ 0.25 గ్రాముల చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చు.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

అప్పులు పెరిగాయి



నాకున్న రెండెకరాలతో పాటు ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంట వేశా. ఇటీవల అధిక వర్షాలు పడడంతో పంటకు తెగుళ్లు సోకి కాయలు ఎర్రబారుతున్నాయి. దీంతో అప్పులు చేసి వివిధ రకాల మందులతో పిచికారీ చేస్తున్నా. పత్తి తీయకముందే తెగుళ్లు సోకడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వమే స్పందించి నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలి.

– బోయిని శ్రీనివాస్, రైతు, తాటిపల్లి

రైతులకు అండగా ఉండండి



ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. రాయికోడ్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్, డైరెక్టర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ భూములకు రోడ్లు, ఇతరాత్ర సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, సర్పంచ్ ప్రభు, వైస్‌చైర్మన్ నారాయణ, డైరెక్టర్లు గరిబోద్దిన్, మొగులయ్య, చెన్నవీరయ్యస్వామి, కుమ్మరి శేఖర్, గౌరీగామ చంద్రయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జెట్టి సుధాకర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



ఆరు స్కీంల పత్రాలను చూపుతున్న నాయకులు

ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారమని ఆ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని అండూర్ గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా, ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గంగు రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి, గోవర్ధన్‌గౌడ్, జానాబాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం తెల్లాపూర్ శ్యామ్‌రావు కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి అవగాహన

నారాయణఖేడ్: ఖేడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి సంబంధించి వచ్చే నెలలో నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న ఆర్డీఓ వెంకటేశ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా వీఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ, వీవీటీ టీం అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ దేవిదాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశ్

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న రాఘవేందర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అన్నారు. వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి తరగతి నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేసి క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు బహుమతులను ప్రదానం చేశారు.

ట్రస్టు ఏర్పాటుకు పనులు ప్రారంభం

నారాయణఖేడ్: మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గిరిజనుల ఆరాధ్యదైవం తపస్వి డాక్టర్ రాంరావు మహారాజ్ ట్రస్ట్ ఏర్పాటుకు బుధవారం భూమి చదును పనులు చేపట్టారు. బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రమేష్ చౌహాన్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, డివిజన్ బాధ్యులు రవీందర్‌నాయక్, రాజునాయక్, లక్ష్మన్‌చౌహాన్, సుభాష్, రవి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో బొల్లారం పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో హరీశ్ అనే కిరాణాషాపు యజమాని వద్ద 10 బీర్లు, 10 క్వార్టర్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు

మునిపల్లి(అందోల్): సోషల్ మీడియాలో వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ గ్రూపుల్లో ఇతర వ్యక్తులు, రాజకీయ పార్టీల నాయకులను రెచ్చగొట్టేవిధంగా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బుదేరా ఎస్‌ఐ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్‌లు తమ గ్రూపుల్లోని సభ్యులు పైవిధంగా వ్యవహరిస్తే వారిని వెంటనే గ్రూపు నుంచి తొలగించాలని సూచించారు. లేనిపక్షంలో గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



మాట్లాడుతున్న తహసీల్దార్ విష్ణుసాగర్

కంగ్టి(నారాయణఖేడ్): వచ్చే నెల నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ విష్ణుసాగర్ మండల పరిధిలోని బాన్సువాడలో పోలింగ్ బూత్‌లను బుధవారం పరిశీలించారు. అయా పోలింగ్ బూత్‌లలో ఎన్నికల సిబ్బందికి సంబంధించిన వసతులు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. మండలంలోని 42 బూత్‌లు పరిశీలించి పూర్తి నివేదిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

పటాన్‌చెరు: సీసీ రోడ్ల నిర్మాణం పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా రజకబస్తీ, గోకుల్‌నగర్, గౌతంనగర్ కాలనీలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఆ పార్టీ నేతలతో క్యాంపు కార్యాలయంలో బుధవారం డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్‌లతో కలిసి న్యాల్‌కల్ మండల నేతలతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, సమావేశాలు, సభలు నిర్వహించడం, కార్యకర్తలను సమీకరించడం, పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్ప, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, న్యాల్‌కల్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రవీందర్, వైస్‌ఎంపీపీ గౌస్, మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు బస్వరాజ్ పాటిల్, సుభాష్ రెడ్డి, ప్రవీణ్, భూమారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులకు చెందిన వారితో పాటు హోతి(కె) తండాకు చెందినవారు 100మందికి పైగా బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు మంకాల్ సుభాష్, విజయ్‌కుమార్, గుండప్ప, శంకర్‌నాయక్, నర్సింహులు యాదవ్, హీరూరాథోడ్, నారాయణజాదవ్, కేషురాథోడ్, సంజు, ఉమేష్‌లాల్, మధు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: కాంగ్రెస్‌తోనే అన్ని రకాల సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గం చీఫ్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని అర్జున్‌నాయక్ తండా, లచ్చునాయక్ తండా, ఆనెగుంట, శేఖాపూర్, మల్‌చల్మ, హుగ్గెల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కేసీఆర్‌తోనే రాలేదన్నారు. 1200 మంది అమరులు బలిదానం చేయడంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. తండాల్లో నెలకొన్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి, నియోజకవర్గం కో ఆర్డినేటర్ గిరిధర్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిశెట్టి నాథోడ్, నాయకులు నర్సింహారెడ్డి, కండెం నర్సింహులు, మైనొద్దీన్, అక్బర్, నరేష్‌గౌడ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బిల్డ్ ప్రోగ్రాంకు 75మంది అర్హత

సంగారెడ్డి అర్బన్: ఐఐటీ హైదరాబాద్‌లోని ఇంక్యుబేటర్ గ్రీన్‌కో గ్రూప్ కలిసి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2023లో బోల్డ్ అండ్ యూనిక్ ఐడియాస్ లీడ్ డెవలప్‌మెంట్ (బిల్డ్) ప్రోగ్రామ్‌ను ప్రారంభించాయి. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలకు స్కౌట్ చేయడం, మద్దతు ఇవ్వడం, వారి సజనాత్మక ఆలోచనలకు ఆర్థిక సహాయం అందించడం బిల్డ్ లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా 600పైగా దరఖాస్తులు రాగా 75 మందిని ఎంపిక చేసి ఇంటర్వ్యూలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికయిన వారిని గ్రీన్‌కో గ్రూప్ సీఈవో అనిల్‌కుమార్ అభినందనలు తెలిపారు.

సీపీజెట్‌లో విద్యార్థినుల ప్రతిభ

మునిపల్లి(అందోల్): బుదేరా చౌరస్తా సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నుంచి ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలో 2023 సంవత్సరానికి గాను అర్హత సాధించడంతో కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి బుధవారం విద్యార్థినులను అభినందించారు. తెలంగాణ యూనివర్సిటీలో భావన, ఉస్మానియా యూనివర్సిటీలో సాయిలక్ష్మి, విజయ, ప్రమిద, యశోద, దీప్తి, మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శిరిష, పాలమూరు యూనివర్సిటీలో శ్యామల అర్హత సాధించినట్లు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ, విద్యార్థినులను అభినందించారు.



సాయిలక్ష్మి



దీప్తి

తనిఖీలు ముమ్మరం

జహీరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు వద్ద పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. మొగుడంపల్లి మండలంలోని మాడ్గి జాతీయ రహదారిపై చెక్‌పోస్టును ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో నిఘా పెంచారు. కర్ణాటకలోని చించోళీ, గౌసాబాద్, బీదర్ నుంచి జహీరాబాద్, హుసెల్లి, హద్నూర్, తాండూర్, కోహీర్, మనియార్‌పల్లి రహదారుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రామచంద్రాపురం, కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇక్రిశాట్ సమీపంలోని జాతీయ రహదారిపై చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఏలాంటి పత్రాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్తే చర్యలు తప్పవని, మద్యం రవాణా చేస్తే క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రతిఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.



మాడ్గి జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఘనంగా శివాజీ రథయాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

సంగారెడ్డి: శివాజీ మహారాజ్ జన్మించి 350 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రం శ్రీశైలం వారి ఆధ్వర్యంలో చేపట్టిన శివాజీ స్ఫూర్తి రథయాత్ర బుధవారం పోరెడ్డిపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా భారీ బైక్‌ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ పాత బస్టాండ్ దగ్గర బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో స్వాములు భగవాన్, హిమాలయ బాబాజీ, కల్యానంద స్వామీజీ, నాయకులు పులిమామిడి రాజు, సురేందర్‌రెడ్డి, అంబరీష్, జగన్, రవిపంకర్, వినోద్, మీడియా ఇన్‌చార్జి విజయ్, సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

యువకుడు మృతి

ఝరాసంగం(జహీరాబాద్): చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం గ్రామానికి చెందిన మల్లేష్ (28) కూలి పనులు చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. జీర్లపల్లి గ్రామ శివారులోని వంతెన కింద ఉన్న నీటి గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని నాగులకట్ట ప్రాంతంలోని 16వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రర్ నాయక్ బుధవారం ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని మూడు ప్రాంతాల్లో కరెంట్ తీగలు వేలాడుతున్నాయని, గాలికి తీగలు రాసుకుని ప్రమాదకరంగా తయారయ్యాయని తెలిపారు. దశాబ్దల క్రితం వేసిన ఇనుప స్తంభాలతో ప్రమాదం పొంచి ఉందని, వెంటనే ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు లోవోల్టేజీ ఉంటుందన్నారు. కరెంట్ హెచ్చు తగ్గులతో గృహోపకరణాలు దగ్ధమవుతున్నాయని వాపోయారు. ట్రాన్స్‌కో వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నేడు మాజీ డిప్యూటీ సీఎం పర్యటన

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఈ నెల 12న పర్యటించనున్నారని మాజీ ఎంపీపీలు బుదేరా రాజేశ్వర్‌రావు, తాటిపల్లి రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లాపూర్, మేళసంగ్యం, బుస్సారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి నాయకులు, కార్యకర్తలు దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు.

బెల్ట్‌షాపులపై దాడులు

పటాన్‌చెరు టౌన్: మున్సిపల్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా రెండు బెల్ట్ షాపులు, అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటలో విశ్వసనీయ సమాచారం మేరకు రెండు బెల్ట్ షాప్‌లపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.29,757 వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అనంతరం అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ బెల్ట్‌షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ శివారు ఫిల్టర్ బెడ్ సమీపంలో చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో మహిళ మృతదేహం పడి ఉందని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి వయస్సు దాదాపు 40 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై బూడిద కలర్ చీర, ఎర్ర బ్లౌజ్, చేతికి ఎర్రగాజులు ఉన్నాయన్నారు. ఈ విషయమై ఎవరికైనా తెలిస్తే వెంటనే 08712656721 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

సంగారెడ్డి అర్బన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలో బందావన్‌కాలనీకి చెందిన వడ్డే పోచయ్య ఈ నెల 6న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల తెలిసినవాళ్లు,బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. దీంతో పోచయ్య భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712656718 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ సూచించారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం



విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేసిన విజయలక్ష్మి విఠల్ దంపతులను జహీరాబాద్ ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంగప్ప, బరూర్ దత్తాత్రి, గోపాల్, శ్రీశైలం, సిద్దు, ప్రదీప్, చంద్రప్ప, కృష్ణ, ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.